చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధం



భీమవరంలో వెలగ కాయలు, బత్తాయి, నారింజ కాయలు, మొక్కజొన్న పొత్తుల దుకాణం



అన్ని రకాల పత్రిలు

- నేడు మండపాల్లో కొలువుతీరనున్న గణనాథుడు
- 3 నుంచి 11 రోజుల పాటు ఉత్సవాలు
- వరద కారణంగా పెరిగిన పూలు, పండ్ల ధరలు
- స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో మట్టి ప్రతిమల పంపిణీ

భీమవరం(ప్రకాశం చౌక్): సర్వవిఘ్నాలు తొలగించి మొదటి పూజ అందుకునే వినాయకుని చవితి పండగకు సర్వం సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా ఊరూవాడ పట్టణం పల్లె అన్ని చోట్ల వినాయక చవితి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి శనివారం ఘనంగా వినాయక చవితి పండగను నిర్వహించేందుకు భక్తులు, కమిటీ సభ్యులు సిద్ధంగా ఉన్నారు. శుక్రవారం ఉదయం ఉత్సవాల నిర్వాహకులు, ఆలయాల కమిటీ సభ్యులు, యువత వినాయకుని విగ్రహాలను బాణసంచా కాల్పులతో తీన్‌మార్ వాయిద్యాలతో వాహనాలపై సందడి సందడిగా ఊరేగింపు నడుమ మధ్యాహ్నా నాటికే ఆయా ప్రాంతాల్లో నిర్వహించే చవితి మహోత్సవాలకు తీసుకువచ్చారు. జిల్లాలో ప్రధాన పట్టణాలైన భీమవరం, తణుకు, నర్సాపురం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు ప్రధాన సెంటర్లులైన ఆకివీడు, ఉండి, వీరవాసరం, ఆచంట తదితర సెంటర్లలోని మార్కెట్‌ల్లో వినాయక చవితికి అవసరమైన మట్టి విగ్రహాలు, పూలు, పండ్లు, పత్రి, పాలీలు, దుకాణాల వద్ద జనం సందడి నెలకొంది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు కొనుగోలుదారులతో ఆయా దుకాణాలు కళకళలాడాయి. కలువ పువ్వు దగ్గర నుంచి వెలగకాయ, అన్ని రకాల పత్రిలు వరకు అన్నింటినీ వ్యాపారాలు ఆయా మార్కెట్‌లోకి తీసుకురావడంతో జిల్లా ప్రజలు శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు కొనుగోళ్లు చేసి శనివారం నాడు నిర్వహించుకునే చవితి పూజకు సిద్ధం చేసుకున్నారు.

వరదల, వర్షాల కారణంగా పెరిగిన ధరలు

జిల్లాలోని రోజులు తరబడి కురిసిన వర్షాలకు, ఇతర జిల్లాలో వచ్చిన వరదలకు పండ్లు, కాయలు, పూల తోటలు దెబ్బతినడం, ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వాటిని తీసుకురావడంతో రవాణా ఖర్చు పెరిగింది. దీంతో వాటి ధరలు గతేడాది కంటే 10 నుంచి 20 శాతం పెరిగాయి. ఉత్సవాల నిర్వాహికులు మాత్రం పెద్ద ఎత్తున్న అన్ని రకాల పండ్లు, పత్రి, పూలు కొనుగోలు చేశారు.

అందరికీ ఉపాధి

వినాయకుని చవితి పండగ అందరికీ ఉపాధి తెచ్చిపెట్టింది. పూజ సామగ్రి విక్రయించే వారి దగ్గర నుంచి పూజ జరిపించే పూజారుల వరకు రోజుల తరపడి ఉపాధి పొందే అవకాశం ఉంది. లైటింగ్, డైకరేషన్, షామియానా, కిరాణా, బాణసంచా, పూలు, పండ్లు, వ్యాపారాలతో పాటు కళాకారులకు కూడా ఉపాధి లభించనుంది. భజనలు, కళా ప్రదర్శనలు, నిమజ్జనానికి డీజే, తీన్‌మార్, ఇలా అందరికీ చవితి ఉత్సవాలు సంతోషంతో పాటు ఉపాధిని అందించనుంది.

నేడు మండపాల్లో కొలువై పూజలు అందుకోనున్న విఘ్నేశ్వరుడు

శనివారం చవితి మహోత్సవాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో అలాగే ఆలయాల ప్రాంగణాల్లో వినాయకుడు కొలువుతీరి తొలి పూజను అందుకుంటాడు. మండపాల వద్ద ప్రత్యేక డెకరేషన్, లైటింగ్, విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేశారు. సౌండ్ సిస్టమ్స్, టెంట్‌లు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల ఉత్సవాల నిర్వాహకులు 3 నుంచి 11 రోజుల పాటు వినాయక చవితి మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం వినాయకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ప్రశాంత వాతావరణంలో చవితి ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న భీమవరం డీఎస్పీ ఆర్‌జే జయసూర్య

భీమవరం: ప్రశాంతమైన వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు జరిగే విధంగా కమిటీ వారు చర్యలు తీసుకొని, పోలీస్ వారికి సహకరించాలని భీమవరం డీఎస్పీ ఆర్.జె జయసూర్య సూచించారు. ఉత్సవ రోజుల్లో, నిమజ్జన సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, నిబంధనలపై అవగాహన కల్పించడానికి ఉత్సవ కమిటీ వారందరికీ స్థానిక త్యాగరాజు భవన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. భీమవరంలోని పోలీస్ అధికారులు, మున్సిపల్, రెవెన్యూ, ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులతో కలిసి సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇస్తున్నామన్నారు. అన్ని అనుమతులు పొందిన తర్వాత మాత్రమే వినాయక మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మున్సిపల్ మరియు రెవెన్యూ అధికారులు మండపాల ఏర్పాటుకు సంబంధించి తగు సూచనలు చేశారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

భీమవరం అర్బన్: యనమదుర్రులో శుక్రవారం మెల్లా సరోజి కృష్ణమూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో 200 మట్టి వినాయక ప్రతిమలు, వ్రతకల్పాల ఉచిత పుస్తకాలు పంపిణీ చేశారు. సమితి నిర్వాహకులు మెల్లా రాంబాబు, చెన్ను నాగబాబు, గెద్దాడ రాంపండు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరద బాధితులకు ఆర్థిక సాయం



రూ.10 లక్షల చెక్కును కలెక్టర్ నాగరాణికి అందజేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): విజయవాడ వరద బాధితులకు శుక్రవారం భీమవరం మండలం పెద్ద అమిరం స్వామి వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు వేగిరాజు శివ వర్మ రూ.5 లక్షలు, పూర్వ జిల్లా వాసి ప్రస్తుతం హైదరాబాద్‌లోని శ్రీ గోపికృష్ణ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ కనుమూరి గోపాలరాజు రూ.5 లక్షలు చెక్కులను వారి ప్రతినిధులు కలెక్టర్ చదలవాడ నాగరాణికి అందజేశారు. భీమవరానికి చెందిన రవీంద్ర శ్రీరామ్ కమర్షియల్ కార్పొరేషన్ చైర్మన్ వేగేశ్న కృష్ణంరాజు సీఎం రిలీఫ్ ఫండ్ నిమిత్తం రూ.లక్ష చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. పెనుగొండ మండలం సిద్ధాంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఎస్.వి.వి ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది రూ.25 వేల చెక్కును భీమవరంలో కలెక్టర్‌కు, డీఈవో జి.నాగమణి ఆధ్వర్యంలో అందజేశారు.

బాలసంజీవిని కిట్ల పంపిణీ

భీమవరం: గర్భిణులు, బాలింతలకు మొదటి శుక్రవారం బాలసంజీవిని కిట్లు, బియ్యం, నూనె, గుడ్లు, పాలు ఎఫ్ఆర్ఎస్ ద్వారా శుక్రవారం పంపిణీ చేస్తున్నట్లు ఐసీడీఎస్ అర్బన్ సెక్టార్ సూపర్‌వైజర్ సరళ చెప్పారు. ఇందిరాగాంధీ మునిసిపల్ స్కూల్ ఆవరణలోని గరువుపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలు టి నీలిమ, ఎం శాంతకుమారి, పి రాహే పాల్గొన్నారు.

జ్వరాలు తగ్గుముఖం

ఆకివీడు : జిల్లాలో వైరల్ ఫీవర్ల ప్రభావం తగ్గుముఖం పట్టిందని జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు తెలిపారు. కొల్లేరు తీరంలోని కాళింగగూడెంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. దుంపగడపలో ఇద్దరికి చికున్‌గున్యా లక్షణాలున్నట్టు గుర్తించామన్నారు. బాలిక మృతిపై విచారణ చేయించారని, మందుల వల్ల చనిపోయినట్టుగా ఎవరూ ధ్రువీకరించలేదని చెప్పారు.

పాస్‌పోర్ట్ పోయినది

అనంతవరపు విజయ, W/o సుబ్బారావు డోర్ నెం. 2-46, ఆదిమూలపుంత, విస్సాకోడేరు గ్రామం, పాలకోడేరు మండలం, అను నేను ది.27.08.2024న R0731906 నెంబరు గల పాస్‌పోర్ట్‌ను కవరులో పెట్టుకుని విస్సాకోడేరు నుండి భీమవరం పాత బస్టాండ్ వద్ద గల జిరాక్స్ సెంటర్‌కు వెల్లుచుండగా మార్గమధ్యంలో పోయినది. నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రస్‌కు తెలియజేయగలరు.

సెల్ : 9908512435

మట్టి వినాయక ప్రతిమల తయారీపై పోటీ



మట్టి వినాయక ప్రతిమల తయారీ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలోని బీవీ రాజు కళాశాలలో ఎన్ఎస్ఎస్, విష్ణు కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కాలుష్య రహిత వినాయక ప్రతిమల తయారీ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఐఆర్ కృష్ణంరాజు, వైస్ ప్రిన్సిపల్ చదలాడ సత్యనారాయణ మాట్లాడుతూ నేటి కాలంలో అధిక శాతం విద్యార్థులు సెల్ ఫోన్‌కు బానిసలయ్యారని ఆటవిడుపుగా క్రియేటివ్‌గా ఉన్న కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సోషలైజేషన్ పెరుగుతుందన్నారు. ఈ పోటీల్లో అత్యంత సుందరంగా వినాయక ప్రతిమలను తయారుచేసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

భీమవరం: భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్, ఈకో క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల తయారీ, పంపిణీ నిర్వహించారు. ప్రిన్సిపల్ వీకేజే ప్రసూన, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె శ్రీనివాసరావు, అధ్యాపకులు పి రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులు అందిస్తున్న దృశ్యం

భీమవరం: ఎస్ఆర్ కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థినులతో ఏర్పాటుచేసిన గీత స్కాలర్‌షిప్‌నకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. శుక్రవారం జీవీఆర్ శ్రీదేవి, కె భాను, ఎన్ ధనలక్ష్మి ఒక్కొక్కరికీ రూ.25 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు మాట్లాడుతూ తమ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకురాలిగా పనిచేసిన గీతారాజ్ అస్వస్థతతో చనిపోవడంతో ఆమెపై ఉన్న ప్రేమతో విదేశాల్లో స్థిరపడి ఉన్నతస్థానాల్లోఉన్న 1984–87 బ్యాచ్ విద్యార్థినులు కొంత మొత్తం శాశ్వత నిధి ఏర్పాటు చేసి ఏటా ముగ్గురు విద్యార్థినులకు గీతారాజ్ పేరిట కళాశాల అల్యూమినియం అసోసియేషన్ ద్వారా స్కాలర్‌షిప్స్ అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్పార్క్‌ట్యాంక్ ఆవిష్కరణ పోటీలు



భీమవరం విష్ణు కళాశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో స్పార్క్‌ట్యాంక్ 2024 దేశవ్యాప్త ఆవిష్కరణ, వ్యవస్థాపక పోటీ శుక్రవారం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ మంగం వేణు చెప్పారు. ఈపోటీల్లో దేశంలోని వివిధ కళాశాలలకు చెందిన 21 విద్యార్థి బృందాలు పాల్గొని వినూత్నమైన ఆవిష్కరణలు ప్రదర్శించారన్నారు. పోటీల్లో విష్ణు ఇంజనీరింగ్ కళాశాల ఎనర్జీ ఎక్స్ బృందం ప్రథమస్థానంలో నిలిచి రూ.40 వేలు బహుమతి గెలుచుకున్నట్లు వివరించారు. వీఆర్ సిద్ధార్థ కళాశాలకు చెందిన సర్వధార టెక్ అండ్ ఇన్నోవేషన్స్ బృందం ద్వితీయస్థానంలో రూ. 30 వేలు, భీమవరం పట్టణానికి చెందిన మిషన్ ఫిట్ బృందం తృతీయస్థానంలో రూ. 20 వేలు నగదు బహుమతులు గెల్చుకున్నట్లు చెప్పారు. మద్రాసు చెందిన ఐఐటీ అగ్రిస్కేప్, పీపీ సవాని విశ్వవిద్యాలయానికి చెందిన స్మార్ట్‌షూ బృందాలకు ప్రత్యేక బహుమతులుగా రూ. 5 వేలు చొప్పున, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్రాసు ఐఐటీ రీసెర్చ్ పార్క్ టెన్ ఎక్స్ టీమ్ ప్రొగ్రామ్ మేనేజర్ ప్రగతీష్, విష్ణు కళాశాల డైరెక్టర్ పి శ్రీనివాసరాజు, వైస్ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, వీఎస్ఎన్ నర్సింహరాజు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం



ఉండిలో వినాయకుడి మట్టి విగ్రహాల పంపిణీ

ఉండి: వినాయక చవితి రోజున ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలనే పూజించాలని లయన్స్ క్లబ్ ఉండి అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు అన్నారు. శుక్రవారం ఉండి సెంటర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భూపతిరాజు హరనాథరాజు సహకారంతో గణనాథుని మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు గాదిరాజు రంగరాజు, రుద్రరాజు నరసరాజు, బొండాడ కేశవ, కాగిత మహంకాళి, గాదిరాజు వెంకటేశ్వరరాజు, బీవీ సుబ్బరాజు, గాదిరాజు సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో..

మానవత తరపున ఉండి సెంటర్‌లో భక్తులకు వినాయక మట్టి విగ్రహాలను మానవత స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్ష కార్యదర్శులు పీఆర్ కృష్ణంరాజు, గాదిరాజు రంగరాజు శుక్రవారం పంపిణీ చేశారు. మానవతం మండల కో కన్వీనర్ కొమ్మన నాగబాబు, కో చైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు, కోశాధికారి సత్యనారాయణ, వాసు, మున్సీ, పి.రంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చవితి సందడి

కాళ్ల: గ్రామాల్లో వినాయక చవితి సందడి ప్రారంభమైంది. గణనాథుల ప్రతిమలను ప్రతిష్ఠించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. కాళ్ల, దొడ్డనపూడి, పెదఅమిరం, జువ్వలపాలెం, కోపల్లె, సీసలి, ఏలూరుపాడు తదితర గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. పెదఆమిరంలో రాష్ట్రయ రహదారిని ఆనుకుని భారీ విగ్రహాలను విక్రయిస్తున్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

భీమవరం: మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం న్యాయస్థానాల సముదాయంలో ఈనెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు స్థానిక పోక్సో కోర్టు స్పెషల్ న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ చెప్పారు. ప్రతి కోర్టులో న్యాయమూర్తి, న్యాయవాది సభ్యునితో బెంచ్ ఏర్పాటు చే స్తామని నాలుగు బెంచ్‌లు మండల న్యాయ సేవా సంస్థ చైర్‌పర్సన్ డి సత్యవతి ఏర్పాటు చేశారన్నారు. కక్షిదారులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

బాలుడి ఆరోగ్యంపై కలెక్టర్ ఆరా



బాలుడి ఆరోగ్యంపై ఆరా తీస్తున్న కలెక్టర్ నాగరాణి

ఆకివీడు : చినకాపవరం డ్రెయిన్ ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని భావించి అధికారులు స్థానిక సమతానగర్ వీరమల్లు కాలనీలోని సుమారు 20 కుటుంబాలను జెడ్పీ స్కూల్‌కు గురువారం అర్ధరాత్రి తరలించారు. ఈ పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ నాగరాణి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. బాధితులతో మాట్లాడారు. అనారోగ్యంతో ఉన్న బాలుడ్ని తన తల్లి తీసుకువచ్చి కలెక్టర్‌కు చూపించగా బాలుడికి అందుతున్న వైద్యంపై కలెక్టర్ ఆరా తీశారు. బాలుడికి సదరం ధ్రువీకరణ ప్రతానికి కావాల్సిన ఏర్పాట్లుచేయాలని అధికారులను సూచించారు. బాధితులకు ఇబందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు సూచించారు. శానిటేషన్ ఎప్పటికప్పుడు చేయించాలన్నారు. పునరావాస కేంద్రంలో అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ హెచ్ఎం తోట పోతరాజును ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ఉండి: లాభదాయకమైన ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని రైతులకు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై.నూకరాజు సూచించారు. శుక్రవారం ఉండి మండలం పెదపుల్లేరులో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. బుట్టల అల్లిక, ప్లేట్ల తయారీ, బయోకల్చర్, అజొల్లా తదితర విషయాలపైనా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయ సంబంధమైన వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు.

ఉపాధ్యాయులకు సత్కారం

భీమవరం: భీమవరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుండు కిషోర్, షేక్ బాబాజీ సాహెబ్ మాట్లాడారు. ఉపాధ్యాయులు పీబీవీ శ్రీనివాసరావు, ఏవీవీ సత్యనారాయణ, జి ఆదిలక్ష్మి, వై పెద్దిరాజు, రమణ, వై రాజమణి, గంధం శ్రీదేవిని సత్కరించారు. క్లబ్ కోశాధికారి బొండా వెంకట సుబ్బారావు, ఎస్‌వీఆర్‌సీ జయవర్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

డీఎన్నార్‌లో విద్యార్థుల హాజరుకు బయోమెట్రిక్ అమలు

భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) చెప్పారు. శుక్రవారం బయోమెట్రిక్ హాజరు రూమ్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, అసిస్టెంట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు వరద ఉధృతి పరిశీలన

ఆకివీడు: కొల్లేరు వరద ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని డీఎస్పీ జయసూర్య తెలిపారు. మండలంలోని కొల్లేరు తీర గ్రామం చినమిల్లిపాడులో శుక్రవారం ఆయన పర్యటించారు. ముంపు బారిన ప్రజలు పడకుండా ఉప్పుటేరు, కొల్లేరు పరివాహక ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్టు డీఎస్పీ చెప్పారు. ఆకివీడు, కాళ్ల, భీమవరంలోని లోతట్టు ప్రాంతాల్ని పరిశీలించామన్నారు. కాళ్ల మండలం మోడి, ప్రాతాళ్ల మెరక, ఈస్కూల్‌లంక వంటి గ్రామాలకు ముంపు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఆకివీడు సమతానగర్, ధర్మాపుర అగ్రహారం ప్రాంతాల్ని పరిశీలించామన్నారు. డీఎస్పీ వెంట ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు, ఎస్సై నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బైట్ కళాశాలలో హ్యాకథాన్ పోటీలు

పాలకోడేరు: పెన్నాడలోని భీమవరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో కళాశాల స్థాయి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కొప్పర్తి సురేష్ మాట్లాడుతూ ఈ పోటీల్లో 50 టీములు 12 విభాగాలకు సంబంధించిన ఆలోచనలను ఆవిష్కరించారు. ఉన్నతమైన ఆలోచనలను ఫైనల్ రౌండ్‌కు ఎంపిక చేస్తామని కళాశాల ఎస్పీవోసీ ఏబీఎస్ఆర్ మనోహర్ తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా సీహెచ్ వెంకట్, బి.కోటేశ్వరరావు, కుర్రెళ్ల భాస్కరరావు, యు.వినోద్, ఎస్ మంగతాయారు, సీహెచ్ రోహిణి వ్యవహరించారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ఉండి: విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించడం సంతోషంగా ఉందని రాష్ట్ర జానపద కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు అన్నారు. శుక్రవారం ఉండి జెడ్పీ హైస్కూల్‌లో కోట శ్రీకాంత్, కోట శ్రీనివాస్ తమ తల్లి జ్ఞాపకార్థం అందించిన నగదును ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఉండి జెడ్పీ హైస్కూల్‌లో చదవుకుని ఇప్పుడు అమెరికాలో స్థిరపడిన శ్రీకాంత్, శ్రీనివాస్‌లు ప్రతిఏటా ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు మొదటి మూడుస్థానాల్లో నిలిచే విద్యార్థులకు రూ.15 వేలు ప్రోత్సాహకాలను అందిస్తుండటం గొప్పవిషయమని అచ్చారావు అన్నారు. వెఎస్సార్‌సీపీ నాయకుడు వీరమల్లు మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.